వేములవాడ దవాఖానలో 15 మందికి శస్త్ర చికిత్స

వేములవాడ ఏరియా దవాఖానలో సిబ్బందితో వైద్య బృందం

వేములవాడ, ఆగస్టు 24: వేములవాడ ఏరియా దవాఖానలో గడచిన 24గంటల్లో 15మందికి శస్త్రచికిత్సలు చేశామని ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ, వేములవాడ ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో 24 గంటల్లో రికార్డు స్థాయిలో 15 మంది రోగులకు శస్త్రచికిత్సలు చేశామని తెలిపారు. ఇందులో ఆరు డెలివరీలు, ఒక గర్భసంచిలో గడ్డ, మూడు సాధారణ శస్త్ర చికిత్సలు, ఐదు ఎముకలకు సంబంధించిన మొత్తం 15 శస్త్ర చికిత్సలు చేశామని తెలిపారు. ఇందులో తనతోపాటు గైనకాలజిస్ట్ డాక్టర్ సంధ్య, డాక్టర్ అనిల్, మత్తు వైద్య నిపుణులు డాక్టర్ రాజశ్రీ, డాక్టర్ తిరుపతి వైద్య సిబ్బంది పాల్గొన్నారని పేర్కొన్నారు. వేములవాడ వంద పడకల హాస్పిటల్‌లో ప్రస్తుతం అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నందున ప్రజల సభ్యులను చేసుకోవాలని ఆయన కోరారు. సేవలందించిన వైద్యులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అభినందించారు.

లైంగికదాడికి పాల్పడిన దుర్మార్గుడిని ఉరి తీయాలి

జిల్లా కేంద్రంలోని నేతన్న చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్‌వీ నాయకులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 24: వైద్య విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన దుర్మార్గుడిని ఉరి తీయాలని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని నేతన్నచౌరస్తాలో బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, దవాఖానలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యురాలిపై లైంగిక దాడి ఘటన దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కలకత్తా ప్రభుత్వం వెంటనే స్పందించి నిందితుడిని పట్టుకుని ఉరి తీయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం నాయకులు, విద్యార్థులున్నారు.

గణేశ్ నవరాత్రులు ప్రశాంతంగా జరుపుకోవాలి

వేములవాడ, ఆగస్టు 24: గణేశ్ నవరాత్రులను ప్రశాంతం వాతావరణంలో జరుపుకోవాలని ఏఎస్పీ శేషాద్రి రెడ్డి అన్నారు. గణేశ్ మండప నిర్వాహకులతో వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం జరిగిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. ప్రతి మండపానికి ముగ్గురు బాధ్యత తీసుకోవాలని వారి వివరాలు పోలీసులకు ఇవ్వాలని తెలిపారు. మండపంలో డీజేలకు అనుమతి లేదన్నారు. ఇతరులకు ఇబ్బంది కలుగకుండా నవరాత్రి వేడుకలను జరుపుకోవాలని ఆమె సూచించారు. సమావేశంలో సీఐ వీరప్రసాద్, ఎస్ఐ రమేశ్, ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్, మండప నిర్వాహకులున్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

కోనరావుపేట, ఆగస్టు 24: రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, నేర ప్రవర్తన మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శేఖర్‌రెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో రౌడీ షీటర్స్‌కు కౌన్సెలింగ్ నిర్వహించి, వారి కుటుంబ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత జీవన విధానంలో నేర ప్రవృత్తిని వీడి మంచి ప్రవర్తనతో జీవించాలని సూచించారు. శాంతిభద్రతలతోపాటు హక్కులకు భంగం కలిగించడం, ప్రజలపై దాడులకు పాల్పడడం వంటి చర్యలను మార్చుకోకపోతే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికైనా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇక్కడ కానిస్టేబుల్ విశాల్, జగన్ తదితరులున్నారు.

సలహాలు, సూచనలు ప్రభుత్వానికి నివేదిస్తాం

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- నూతన ఆర్వోఆర్ చట్టం-2024 ముసాయిదాపై చర్చా వేదిక
- హాజరైన రైతులు, రైతు సంఘం నాయకులు, రెవెన్యూ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు

చర్చా వేదికలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

కలెక్టరేట్, ఆగస్టు 24 : నూతన ఆర్వోఆర్ చట్టం-2024 ముసాయిదాపై చర్చ వేదికలో ప్రతి ఒక్కరూ ఇచ్చిన సలహాలు, సూచనలు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వెల్లడించారు. నూతన ఆర్వోఆర్ చట్టం 2024 ముసాయిదాపై చర్చా వేదికను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో శనివారం నిర్వహించగా, కలెక్టర్, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ హాజరయ్యారు. ఈ చర్చకు జిల్లాలోని రైతులు, రైతు సంఘం నాయకులు, రెవెన్యూ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ, అందరి సలహాలు, సూచనలపై ఒక నివేదిక తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. అనంతరం సిరిసిల్ల ఆర్డీవో రమేశ్ నూతన ఆర్వోఆర్ చట్టం-2024 ముసాయిదాలోని ప్రతి అంశాన్ని అందరికీ వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు నిపుణులతో కమిటీ వేసిందని, దాదాపు 18 రాష్ట్రాల్లో అధ్యయనం చేసి, ఆరు నెలల్లోనే ఈ ముసాయిదాను తయారు చేసిందని తెలిపారు. భూ సమస్యలు రాకూడదనే ఉద్దేశ్యంతో చట్టం చేయనుందని పేర్కొన్నారు. దీనిపై ఇప్పటికే ఆన్‌లైన్‌లో సలహాలు, సూచనలు స్వీకరించిదని గుర్తు చేశారు. చట్టం అందరికీ ఉపయోగపడాలనే ఉద్దేశంతో ఇప్పుడు నేరుగా స్వీకరించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి జిల్లాలో రెవెన్యూ కోర్టు ఏర్పాటు చేయాలని, ప్రతి గ్రామానికి వీఆర్వో, వీఆర్ఏలను నియమించాలని, ప్రతి ఏడాది భూమికి సంబంధించి కనీస రుసుం వసూలు చేయాలని, ప్రతి సంవత్సరం పహాణీ తయారు చేయాలని, గ్రామంలోని ప్రభుత్వ భూముల వివరాలు పంచాయతీ కార్యాలయంలో ఉండేలా చూడాలని, అన్ని వివరాలను రీ సర్వే చేయాలని, ధరణిలో ఎదురైన సమస్యలను పరిష్కరించాలని, ప్రొహిబిటెడ్ భూముల విషయంలో నిర్ణయం తీసుకోవాలని చర్చా వేదికకు వచ్చిన వారు తెలియజేశారు. ఇక్కడ సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేశ్, రాజేశ్వర్, తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న రెవెన్యూ అధికారులు, రైతులు, వివిధ పార్టీల నాయకులు

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, ఆగస్టు 24 : శ్రావణమాసం సందర్భంగా వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయం శనివారం భక్తులతో రద్దీగా కనిపించింది. వేకువజాముననే భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి కోడెమొక్కు తీర్చుకున్నారు. అనంతరం క్యూలో వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శనం చేసున్నారు. వివిధ ఆర్జిత సేవల ద్వారా సుమారు రూ.13 లక్షల ఆదాయం సమకూరినట్లు, రాజన్నను దాదాపు 10వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారని ఆలయ అధికారులు వెల్లడించారు.

ఆలయంలో భక్తులు

బీసీ కమిషన్ సభ్యుడికి స్వామివారి ప్రసాదాన్ని అందజేస్తున్న ఆలయ పర్యవేక్షకుడు

రాజన్నను దర్శించుకున్న రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు

వేములవాడ టౌన్,ఆగస్టు 24 : వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వరస్వామివారిని శనివారం రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు కే కిషోర్‌గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయంలో రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాగిరెడ్డిమండపంలో అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేయగా, ఆలయ పర్యవేక్షకులు తిరుపతిరావు వారికి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. వారి వెంట ఆలయ ప్రొటోకాల్ పర్యవేక్షకులు అశోక్, వంశీమోహన్ తదితరులున్నారు.

శిక్షల పెంపుతో సమాజంలో మార్పు

పోలీస్ సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందించిన ఎస్పీ అఖిల్ మహాజన్

తెలంగాణ చౌక్, ఆగస్టు 24: శిక్షల పెంపుతోనే సమాజంలో మార్పు వస్తుందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం కోర్టు డ్యూటీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నిందితులకు శిక్ష పడడంలో కోర్టు డ్యూటీ అధికారులే కీలకమన్నారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసులు, వారెంట్స్, సమన్స్‌పై పలు సూచనలు చేశారు. ఎఫ్ఐఆర్ నమోదు నుంచి కేసు పూర్తయ్యే వరకు నేరాలను నిరూపించేందుకు అవసరమైన రుజువులను సాక్షుల వాంగ్మూలాలను సమర్పించడానికి కీలకంగా వ్యవహరించాలన్నారు. దోషులకు శిక్షలు పడేలా చేస్తేనే సమాజంలో పోలీసులపై నమ్మకం పెరుగుతుందన్నారు. శుక్రవారం కోర్టు వెల్లడించిన మూడు కేసుల్లో ఎనిమిది మందికి శిక్ష పడేందుకు కృషి చేసిన కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్, నరేశ్, కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ మధుసూదన్, ప్రసాద్, రుద్రంగి ఎస్ఐ అశోక్‌ను అభినందించి ప్రశంసా పత్రాలు అందించారు. ఇక్కడ అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

డ్రగ్స్, గంజాయి రహిత సమాజానికి కృషి

- అదనపు ఎస్పీ చంద్రయ్య
- జిల్లాస్థాయి నార్కో సమన్వయ సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ చంద్రయ్య

కలెక్టరేట్, ఆగస్టు 24: డ్రగ్స్, గంజాయి రహిత సమాజానికి అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని అడిషనల్ ఎస్పీ చంద్రయ్య పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాస్థాయి నార్కో సమన్వయ సమావేశాన్ని ఆయా శాఖల ఉన్నతాధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గంజాయి అక్రమ రవాణా చేసినా, విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి స్కూల్ కాలేజీల్లో మత్తు పదార్థాల నిర్మూలనకు కమిటీలను కొనసాగిస్తూ, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. జిల్లా నుంచి గ్రామస్థాయి వరకు వలంటీర్ల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేయాలని సూచించారు. సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ పంచాక్షరి, డీఈవో రమేశ్ కుమార్, అడిషనల్ డీఎంహెచ్‌వో రాజగోపాల్, డీఏవో అఫ్జల్ బేగం, సిరిసిల్ల ఎఫ్ఆర్వో కల్పనా దేవి, అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రిన్సిపాల్‌గా కంకణాల సాగర్

హైదరాబాద్‌లో స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ నరసింహారెడ్డి చేతుల మీదుగా జ్ఞాపికను అందుకుంటున్న ప్రిన్సిపాల్ కంకణాల సాగర్

కోనరావుపేట, ఆగస్టు 24: రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో 2023-24 విద్యా సంవత్సరంలో ఇంటర్ ఫలితాల్లో మంచి మార్కులు సాధించేందుకు కృషి చేసిన ఐదుగురు ప్రిన్సిపాల్స్‌ను ఉత్తమ ప్రిన్సిపాల్స్‌గా ఎంపిక చేశారు. ఈ మేరకు జిల్లా నుంచి కోనరావుపేట మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కంకణాల సాగర్ ఇంటర్ ఫలితాల్లో 95శాతం ఉత్తీర్ణత తీసుకురావడంతో ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఎంపికయ్యారు. దీంతో హైదరాబాద్‌లో డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ నర్సింహారెడ్డి, మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసచారి చేతుల మీదుగా ప్రిన్సిపాల్ కంకణాల సాగర్ జ్ఞాపికను అందుకున్నాడు. సాగర్‌కు పాఠశాల ఉపాధ్యాయులు బృందం అభినందనలు తెలిపారు.

మరో నేత కార్మికుడు ఆత్మహత్యాయత్నం

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 24: చేతి నిండా పనిలేక నేత కార్మికులు ఆత్మహత్యల బాట పడుతున్నారు. ఇప్పటికే పదుల సంఖ్యలో ప్రాణాలు తీసుకున్నారు. తాజాగా ఓ కార్మికుడు ఆత్మహత్యాయత్నం చేయడం కలకలం రేపింది. వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండలం మండేపల్లి శివారులోని కేసీఆర్ నగర్ (డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయం)లో ఉంటున్న బోయిని సదానందం(36) మరమగ్గాలు నడుపుతున్నాడు. భార్య భాగ్యలక్ష్మి కూరగాయాలు అమ్ముతుండగా, వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో కొంత కాలంగా ఆయన పనిలేక ఖాళీగా ఉంటున్నాడు. కుటుంబ పోషణ కష్టం కావడం, చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆందోళన చెందాడు. ఈ క్రమంలో శనివారం ఇంట్లోనే గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన సిరిసిల్ల దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ దవాఖానకు తీసుకెళ్లారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED
PLOT FOR SALE
★కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి, అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available,
ఫోన్: 8885731233, 9948033142.
NT- 326217

CHANGE OF NAME & DATE OF BIRTH
I, T. AJAY S/o. RAMSINGH R/o. 3-1-36, Auto Nagar, Sircilla, TG, I have changed my Name from T. AJAY S/o. RAM SINGH To TAKUR AJAY SINGH S/o. TAKUR RAM SINGH. And my Date of Birth as per SSC Records 06-01-1988, I have changed my Date of Birth from 06-01-1988 to 20-01-1987 As per my Aadhar Card & Pan Card.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

వేములవాడ టౌన్ : హంసిని స్కూల్‌లో ఉట్టి కొడుతున్న చిన్నారులు

బోయినపల్లి : ఆనంద్‌విద్యానికేతన్ ఉట్టికొడుతున్న చిన్ని కృష్ణులు

ముకుందా.. ముకుందా..

- విద్యా సంస్థల్లో ఘనంగా ముందుస్తు కృష్ణష్టామి వేడుకలు

జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసుకున్న కార్యక్రమంలో భాగంగా గోపిక, చిన్ని కృష్ణుడి వేశధారణలతో విద్యార్థులు ఉట్టికొడుతూ కృష్ణాష్టమి సంబురాలు నిర్వహించుకున్నారు. ఇక్కడ ఆయా పాఠశాలల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

-గంభీరావుపేట/ కోనరావుపేట/ చందుర్తి/ రుద్రంగి/ బోయినపల్లి/ వేములవాడ టౌన్/ఇల్లంతకుంట/సిరిసిల్ల రూరల్ , ఆగస్టు 24

రుద్రంగి : కృష్ణుడు, గోపికల వేషధారణల్లో చిన్నారులు

వేములవాడ అర్బన్ సెస్ ఇన్‌చార్జి ఏఈగా శ్రీనివాస్‌రెడ్డి

వేములవాడ రూరల్, ఆగస్టు 24: వేములవాడ అర్బన్ మండల సెస్ ఇన్‌చార్జి ఏఈగా శ్రీనివాస్‌రెడ్డి ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో వేములవాడ రూరల్ ఏఈ ఇన్‌చార్జిగా ఉండగా లైన్‌మన్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డికి ఇన్‌చార్జి ఏఈగా బాధ్యతలు అప్పగించారు. దీంతో అర్బన్ సెస్ ఏఈగా శ్రీనివాస్‌రెడ్డి ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 24: గొల్లపల్లికి చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బీఆర్‌ఎస్ నాయకులు శనివారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన నలుగురు లబ్ధిదారులకు రూ.71 వేలు మంజూరు కాగా సదరు చెక్కులను అందించారు. ఇక్కడ బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు అందె సురేశ్, నాయకులు ల్యాగల శ్రీనివాస్‌రెడ్డి, ఎండీ. జబ్బార్, రాగం ఎల్లయ్య, కొండ ఆంజనేయులు, కొండ దాసు, కొండ దేవయ్య, శ్రీశైలం ఉన్నారు.

బస్సు ప్రమాదంలో వృద్ధుడి మృతి

కోనరావుపేట, ఆగస్టు 24: బస్సు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విద్యుత్ ఆపరేటర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే. సిరిసిల్ల పట్టణానికి చెందిన వెంకట్రాజం (68) కోనరావుపేట మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో లైన్‌మెన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో విధులు ముగించుకొని తిరుగు ప్రయాణంలో తన ద్విచక్ర వాహనంపై సిరిసిల్ల వెళ్తున్నాడు. ధర్మారం గ్రామంలో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు సిరిసిల్లలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. వెంకట్రాజం కుమారుడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

లక్ష్మీనరసింహ ఆలయంలో శ్రావణ సందడి

రుద్రంగి, ఆగస్టు 24: శ్రావణ మాసం పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రహ్లాద గుట్టపై వెలిసిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. పూజారులు స్వామి వారికి వేద మంత్రాలతో, పంచామృత అభిషేకాలు జరిపి ప్రత్యేక పూజలు చేశారు. స్థానికులతో పాటు వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఒడిబియ్యం సమర్పించుకున్నారని ఆలయ కమిటీ చైర్మన్ కొమురె శంకర్ తెలిపారు. ఇక్కడ ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులున్నారు.

రాజన్న ఆలయ బుకింగ్ కౌంటర్‌లో 'సేవాదార్' విధులు

వేములవాడ, ఆగస్టు 24: వేములవాడ రాజన్న ఆలయంలోని ముఖ్య బుకింగ్ కౌంటర్‌లో శనివారం సేవాదారు ఉద్యోగ విధులు నిర్వర్తించడంపై భక్తుల విమర్శలకు తావిచ్చింది. అయితే రాజన్న ఆలయంలోని ప్రధాన పూజలకు సంబంధించిన టికెట్ల విక్రయాలు ముఖ్య బుకింగ్ కార్యాలయంలోనే జరుగుతుంటాయి. సదరు విభాగంలో పనిచేసే యాదగిరిగుట్ట ఉద్యోగికి కంప్యూటర్ వినియోగంలో అనుభవం లేకపోవడంతో అతను పనిచేసిన సమయంలో రూ.4వేలు తక్కువగా వచ్చాయని అధికారుల ముందు ఉద్యోగి వాపోయాడు. సదరు ఉద్యోగి తాను ఇక్కడ విధులు నిర్వర్తిచలేనని అధికారులను బతిమలాడుకోవడంతో అతనిని తాత్కాలికంగా వేరేచోటికి బదిలీ చేశారు. అక్కడ పనిచేయాల్సిన మరో ఉద్యోగి ఆకస్మికంగా సెలవు పెట్టడంతో శనివారం సేవాదార్‌తో కౌంటర్‌ను కొనసాగించారు. వేలాది రూపాయలు ఆదాయం వచ్చే కౌంటర్ తాత్కాలిక ఉద్యోగి సేవలు అందించడం సరికాదని, ఏదైనా అక్రమాలు జరిగితే ఎవరు బాధ్యులంటూ భక్తుల నుంచి విమర్శలు వచ్చాయి.

గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన

ఇల్లంతకుంట, ఆగస్టు 24 : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల, గాలిపెల్లి, పొత్తూరు, వల్లంపట్ల గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినులకు విద్యార్థినులకు బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌పై సీఐ మొగిలి శనివారం అవగాహన కల్పించారు. మీతో ఎవరైనా అసభ్యంగా ప్రవర్థించినా, ఇబ్బందులకు గురిచేసినా 100కు గాని 1098కి డయల్ చేయాలని సూచించారు. అనంతరం రేపాక గ్రామం లో యువతకు గంజాయితోపాటు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఇక్కడ ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 24: విద్యార్థినులకు బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌పై తంగళ్లపల్లి ఎస్ఐ సుధాకర్ అవగాహన కల్పించారు. తంగళ్లపల్లి మండల కేంద్రం, మండేపల్లిలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శనివారం పోలీసు శాఖ, సఖీ కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇక్కడ సఖీ కోఆర్డినేటర్ పద్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుస్మిత, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది విద్యార్థినులున్నారు.

పోగొట్టుకున్న మొబైల్ అప్పగింత

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 24: సీఈఐఆర్ అప్లికేషన్ సహాయంతో పోగొట్టుకున్న మొబైల్‌ను పట్టుకుని, బాధితురాలికి అందించినట్లు తంగళ్లపల్లి ఎస్ఐ సుధాకర్ తెలిపారు. తంగళ్లపల్లి మండలం రామన్నపల్లెకు చెందిన కొయ్యడ సంధ్య తన మొబైల్‌ను ఈ ఏడాది మార్చి 9న బద్దెనపల్లి బస్టాండ్‌లో పోగొట్టుకుంది. తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, వివరాలను సీఈఐఆర్ అప్లికేషన్‌లో నమోదు చేశారు. శనివారం ఫోన్‌లో ఇతర సిమ్‌కార్డు వేయగా అలెర్ట్ మెస్సేజ్ రాగానే వెళ్లి స్వాధీనం చేసుకున్నారు. ఠాణాలో ఎస్ఐ సుధాకర్ ఫోన్‌ను యువతికి అందజేశారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది శ్రీకాంత్‌ను ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

విద్యార్థుల క్షేత్ర స్థాయి సందర్శన

వీర్నపల్లి, ఆగస్టు 25: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు క్షేత్రస్థాయి సందర్శనకు వెళ్లారు. ఎనిమిదో తరగతి పాఠ్యాంశంలో భాగంగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు నరేశ్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు అటవీ శాఖ కార్యాలయం సమీపంలోని నర్సరీని పరిశీలించారు. అటవీ శాఖ సెక్షన్ అధికారి రంజిత్ కుమార్ , బీట్ అధికారి కిరణ్ కుమార్ అడవుల యొక్క ప్రాధాన్యత, వాటి సంరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ గూర్చి తెలియజేశారు. ఇక్కడ పీడీ ప్రతాప్‌కుమార్,విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలు కాపాడాలి

- విశ్వహిందూ పరిషత్ నాయకుడు గడప కిషోర్‌రావు

వేములవాడ టౌన్, ఆగస్టు24 : రాజన్న ఆలయంలో శుక్రవారం స్వామివారిని నివేదించే ప్రసాదం తయారీలో జరిగిన అలసత్వం, సిబ్బంది నిర్లక్ష్య ధోరణిపై తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ఇక మీదట ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని శనివారం ఆలయ ఏఈవోలు శ్రీనివాస్, శ్రవణ్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఆలయ పవిత్రతకు భంగం కలుగకుండా, భక్తుల మనోభావాలను కాపాడేలా అధికారులు నడుచుకోవాలని, సామాన్య భక్తుల మనోభావాలను గౌరవించాలని ఈ వినతి పత్రంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగుల రాములు గౌడ్, గౌరిశెట్టి శ్రీనివాస్, సొంటి నవీన్, తోట అజయ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 24: మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక సాధికారత సాధించాలని డీఆర్డీవో శేషాద్రి అన్నారు. శనివారం గొల్లపల్లిలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మిల్క్ డెయిరీని ప్రారంభించారు. ఇక్కడ ఏఆర్డీవో శ్రీనివాస్, డీపీఎం పద్మయ్య, ఏపీఎం మల్లేశం తదితరులున్నారు.

వ్యాయామంతోనే ఆరోగ్యం

వేములవాడ, ఆగస్టు 24: వ్యాయామంతోనే ఆరోగ్యంగా ఉంటామని వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ అన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు శనివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో పోలీసులతో యోగా నిర్వహించిన అనంతరం మాట్లాడారు. ప్రతిరోజూ వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. యోగా చేయడంతో మనిషి ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండడానికి దోహదపడుతుందని చెప్పారు. ఇక్కడ ఎస్ఐ రమేశ్, ఏఎస్ఐ బెగ్, పోలీసులున్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

వేములవాడ రూరల్, ఆగస్టు 24: వేములవాడ మండలం కొడుముంజ మాజీ సర్పంచ్ బాలసాని వెంకవ్వ (65) శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. గతంలో కొడుముంజ సర్పంచ్‌గా వెంకవ్వ ఐదు సంవత్సరాలు కొనసాగారు. ఆమె మృతిపై గ్రామస్తులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

మహిళా గిఫ్ట్ స్కీం డ్రా

వేములవాడ రూరల్, ఆగస్టు 24: వేములవాడ ఆర్టీసీ డిపోలో డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన మహిళలకు గిఫ్ట్ స్కీం లక్కీ డ్రా విజేతలను ఎంపిక చేసినట్లు ఆర్టీసీ డీఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ, ప్రతి 15 రోజులకు ఒకసారి గిఫ్ట్ స్కీం లక్కీడ్రా విజేతలను ఎంపిక చేస్తామని, అందులో భాగంగా సుచరిత, భాగ్యమ్మ, లతను ఎంపిక చేసి విశాల షాపింగ్ మాల్ యాజమాన్యంతో బహుమతులను అందజేశామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు మల్లేశం, పీఆర్వో శ్రీనివాస్‌యాదవ్, సురేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రగతి చక్రం అవార్డుకు ఎంపిక

వేములవాడ రూరల్, ఆగస్టు 24: వేములవాడ ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న ట్రాఫిక్ సూపర్‌వైజర్‌తోపాటు ఇద్దరు కండక్టర్లు ఉత్తమ ప్రగతి చక్రం అవార్డులను అందుకున్నట్లు ఆర్టీసీ డీఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ, డిపోలో పనిచేస్తున్న ట్రాఫిక్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, కండక్టర్లు ప్రమీ ల, నర్సింహులు రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికవడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన ప్రగతి చక్ర అవార్డు కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండీ సజ్జనర్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించారని తెలిపారు.